సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2025

ప్రమాద బీమా.. తపాలా శాఖ ధీమా!
సామాన్యులకు అందుబాటులో ఉండేలా తపాలా శాఖ ప్రమాద బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది.
-10లో



ఉల్లి రైతులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి
గిట్టుబాటు ధర లేని కారణంగా ఉల్లి పంట సాగు చేసిన రైతుల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని రాచమల్లు తెలిపారు. -10లో

గరిష్టం/కనిష్టం
32.2/24.6

వాతావరణం
జిల్లాలో బుధవారం 24.6 - 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు అవగాహన సదస్సు
కడప అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం ఊటుకూరు ఏఆర్ఎస్‌లో ఉద్యాన పంటల అభివృద్ధిపై అవగాహన సదస్సుతోపాటు వర్క్‌షాపును నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ తెలిపారు. ఈ సదస్సు, వర్క్‌షాపునకు కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు, అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారులు, కంపెనీలు, సంఘాలు, ఎగుమతిదారులు, వ్యాపారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు పాల్గొనవచ్చని వివరించారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో నాలుగు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఒంటిమిట్ట మండలంలో అత్యధికంగా 17.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే గోపవరంలో 10.8 మి.మీ, చాపాడులో 10.2 మి.మీ, బి.కోడూరులో 6.4, పోరుమామిళ్లలో 6.2, ఖాజీపేటలో 5.4, బిమఠంలో 4.2, మైదుకూరులో 3.4, పెద్దముడియంలో 3.2, ప్రొద్దుటూరు, బద్వేల్‌లలో 2, కలసపాడులో 1.8, కడపలో 1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

డీఎస్‌డీఓగా గౌస్‌బాషా బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న గౌస్ బాషా

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా గౌస్ బాషా బుధవారం డీఎస్‌ఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా డీఎస్‌డీవోగా పని చేస్తున్న గౌస్‌బాషా బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తగిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

అటవీప్రాంతంలో తనిఖీలు

కొండూరు బీట్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సిద్దవటం: ప్రతి నెల రాష్ట్రంలో అనుమానిత అటవీ ప్రాంతాల్లో తనిఖీలు చేపడతామని విజిలెన్స్ డీఎఫ్ఓ ధర్మదీక్షిత్ తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొన్ని సమస్యాత్మక ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టామని, కొండూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించామని తెలిపారు. ప్రపంచంలోనే విలువైన, ఖరీదైన ఎర్రచందనం అటవీ సంపద కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. విజిలెన్స్ ఎఫ్ఆర్ఓ శంకరయ్య, ఎఫ్ఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓ విజిలెన్స్ సురేంద్రబాబు, సిద్దవటం అటవీ శాఖ అధికారిణి కళావతి, డీఆర్ఓ ఓబులేసు పాల్గొన్నారు.

ఎరువులు ఎమ్మార్పీ రేట్లకే అమ్మాలి: కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్/ కడప అగ్రికల్చర్: రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భూమాత రక్షణ కమిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు భూమాత రక్షణ కమిటీ లో ఈ అంశాన్ని చేర్చి ప్రకృతి సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లు ఎమ్మార్పీ ధరలకే ఎరువుల పంపిణీ చేసి రైతులకు ఎరువుల వినియోగం పై అవగాహన కల్పించాలన్నారు. భూమాత రక్షణకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనలో సంబంధిత శాఖలు అన్ని సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం.. దయనీయం!

కూటమి పాలకుల నిర్లక్ష్యం కారణంగా 'ఎన్టీఆర్ వైద్య సేవ'(ఆరోగ్య శ్రీ) పథకం గాడి తప్పింది. ఐదు రోజులుగా కీలకమైన ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవ పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా పేదలకు ఉచిత వైద్యం గాలిలో దీపంగా మారింది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడంపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది.

- ఐదు రోజులుగా 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు పూర్తిగా నిలుపుదల
- వైద్యం కోసం పేదల అవస్థలు
- గాడితప్పిన 'ఎన్టీఆర్ వైద్య సేవ'పథకం


రోగులతో కిటకిటలాడుతున్న కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి



కడప రూరల్: 'ఎన్టీఆర్ వైద్య సేవ'పథకం అస్తవ్యస్తంగా మారింది. కార్పొరేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు లభించేడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఆ ఉద్దేశమే నీరుగారుతోంది. ప్రభుత్వం ఈ నెట్ వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పెండింగ్ బిల్లులు రూ. కోట్లల్లో పేరుకుపోయాయి. ఫలితంగా వైద్యం పడకేసింది.

రోజుల తరబడి ఇదే ప్రథమం
ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం కోట్లల్లో బిల్లులను మంజూరు చేయాలి. ఏడాది దాటినా ఇంతవరకు బిల్లులను మంజూరు చేయలేదు. ఫలితంగా ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి ఔట్ పేషెంట్‌తో పాటు అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేశారు. ప్రధానమైన గుండె, కిడ్నీ తదితర వ్యాధులకు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు లభిస్తాయి. ఇప్పుడు ఈ ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలుపుదల చేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లండి...
యథావిధిగా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు వచ్చే పేదలు వైద్య సేవలు లేవని తెలిసి ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఉండే వైద్య మిత్రలు వచ్చిన వారితో 'వైద్య సేవలు నిలుపుదల చేశారు. ఉచిత వైద్యం కావాలంటే కడప రిమ్స్ లేదా ఇతర ప్రభుత్వ ఆసుత్రులకు వెళ్లాలి'అని సూచిస్తున్నారు. దీంతో సాధారణంగానే వ్యాధిగ్రస్తులతో కడప రిమ్స్‌తో పాటు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతుంటాయి. ఇప్పుడు ఆ ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య మరింతగా పెరిగింది.

జిల్లాలో 'ఎన్టీఆర్ వైద్య సేవ' వివరాలు	ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు	
నెట్ వర్క్ ఆసుపత్రుల సంఖ్య మొత్తం: 119	ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు: 42	ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం బకాయిలు: రూ 150 కోట్లు
	ఒక ఆసుపత్రికి ఒక రోజుకు వచ్చే ఓపీలు : 30కి పైగా	వర్తించే వ్యాధులు: 3,255
అందులో ప్రభుత్వ ఆసుపత్రులు: 72	అందులో ఇన్ పేషెంట్స్‌గా చేరే వారు : 5 మందికి పైగా	ఒక రోజుకు వచ్చే రోగులు: 2 వేలకు పైగా

108 వాహనాలన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల వైపే...
108 అంబులెన్స్ వాహనాలు ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే. కూటమి ప్రభుత్వం రాకముందు ఎవరైనా అనారోగ్యానికి గురైనా, ఆపద సంభవించినా ఆ వ్యక్తిని ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రితో పాటు ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వ్యక్తికి ఏ జబ్బు వచ్చినా..ఏ సమస్య అయినా ఆ వాహనాలన్నీ దాదాపుగా కడప రిమ్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల వైపు వెళుతున్నాయి.


108 వాహనం ద్వారా చికిత్స కోసం కడప రిమ్స్‌కు వస్తున్న రోగులు

భారమైన వైద్యం!
బంద్ ప్రభావం పేదలపై పడింది. ఉచిత వైద్యం లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లలేనివారు ప్రైవేట్ వైద్యుడిని లేదా ఆర్ఎంపీలను సంప్రదిస్తున్నారు. ఫలితంగా ఒక పేద రోగి డాక్టర్ ఫీజును రూ.300కు పైగా చెల్లిస్తున్నారు. వైద్య పరీక్షలకు ఎంత లేదన్నా రూ.350 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. స్కానింగ్‌కు రూ.7 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా జిల్లాలో ఎవరికైనా పెద్ద సమస్య వచ్చిందంటే కడపకు రావాలి. ఇక్కడ ఆ వ్యాధికి చికిత్స లభించకపోతే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. పైగా ఇది సీజనల్ వ్యాధుల కాలం. డెంగ్యూ, టైఫాయిడ్ తదితర జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో వైద్య సేవలు బంద్ కావడంతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపివేయడంతో..

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మిరెడ్డి

ఆయాసంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఈ వృద్ధుడి పేరు లక్ష్మిరెడ్డి. కడప నగర శివార్లలోని పుట్లంపల్లె నివాసి. మనవడు హర్షవర్ధన్‌రెడ్డి ఆయనకు సహాయంగా ఉన్నాడు. తీవ్ర ఆయాసంతో మూడు రోజుల నుంచి కడప రిమ్స్‌లోని ఐసీయూలో వైద్య చికిత్సలు పొందుతున్నాడు. ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేయడంతో చేసేదిలేక తాత లక్ష్మిరెడ్డిని తీసుకుని చికిత్స కోసం రిమ్స్‌కు వచ్చానని మనవడు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. పేదలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరాయంగా ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

'ఆరోగ్య శ్రీ'పై అసూయ
2007-2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యంను అందించాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా లక్షలాది మంది పేదలు ఉచిత వైద్యం ద్వారా పునర్జన్మను పొందారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేసింది. కాగా టీడీపీ ప్రభుత్వం ఎప్పుడొచ్చినా 'ఆరోగ్యశ్రీ'పథకం ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే ఉంటుంది. దీంతో 'ఆరోగ్య శ్రీ'అంటే టీడీపీకి అక్కసు అనే అభిప్రాయం నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కాలంలోనే 4వ సారి ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య సేవలను నిలుపుదల చేశారు. దీంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ'పథకం గాడితప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

లెక్కిచ్చి చూపించుకుంటున్నాం

నా కుమారునికి ముక్కు సమస్య ఉండడంతో కడపకు వచ్చాను. ఇక్కడికి వచ్చాక ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలు నిలిపేశారని చెప్పారు. దీంతో డాక్టర్ ఫీజుకు లెక్కిచ్చి నా కుమారుడికి చూపించాను. ఉచిత వైద్యం ఉండి ఉంటే నాకా డబ్బు మిగిలేది.- వీరకుమారి, మైదుకూరు

మానవత్వంతో సేవలు అందించాం

ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోయినా, మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాం. బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం. సమస్యను పరిష్కరించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో సేవలను పూర్తిగా నిలిపివేశాం. మా సమస్యలను ప్రజలు అర్థం చేసుకోవాలి.- డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్

వైద్య మిత్రలను సంప్రదించాలి

కొన్ని ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు కొనసాగుతున్నాయి. అలాగే కడప రిమ్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు లభిస్తాయి. వైద్య మిత్రల ద్వారా ఉచిత వైద్యం లభించే ఆసుపత్రుల వివరాలను అడిగి తెలుసుకోవచ్చు.
-డాక్టర్ బాలాంజనేయులు, జిల్లా కో ఆర్డినేటర్, ఎన్టీఆర్ వైద్య సేవ

సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కూటమి నేతలు రాష్ట్ర ప్రజలకు ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు.. సూపర్ ఫ్లాప్ అయ్యాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోసమే కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారన్నారు. వారికి ఎల్లో మీడియా వంత పాడుతూ ప్రజలను మభ్యపెట్టిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు తొందరగానే గ్రహించారన్నారు. కూటమి అమలు చేస్తున్న అరకొర పథకాల కంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయని ప్రజలు అభిప్రాయానికి వచ్చారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఉల్లి రైతులను ఆదుకోవాలి..
జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉల్లి రైతులు ఎంపీని కలిశారు. ఉల్లి పంట ధరలు దారుణంగా పతనమయ్యాయని, లక్షలు ఖర్చు పెట్టి పంటను సాగు చేసి అప్పులపాలయ్యామని వాపోయారు. దీనికి స్పందించిన ఎంపీ ఇప్పటికే ఉల్లి రైతుల కష్టాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు నివేదించామన్నారు. దీంతో పాటు మరోసారి అక్కడి నుంచే కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు ప్రభుత్వం హెక్టార్‌కు రూ.50వేలు పరిహారం ప్రకటించిందని, అదేవిధంగా వైఎస్సార్ జిల్లా రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. దీనికి కలెక్టర్ రెండు, మూడు రోజుల్లో జిల్లా రైతులకు కూడా నష్టపరిహారం విషయమై జీఓ వస్తుందని ఎంపీకి వివరించారు.

కూటమి ప్రభుత్వంవల్ల రాష్ట్రానికి అన్యాయం
కూటమి ప్రభుత్వంవల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ సాయినాథ్ శర్మ పేర్కొన్నారు. బుధవారం పులివెందులలో ఎంపీ అవినాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనను ఆత్మీయంగా అభినందించి కొత్త బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

నివాళి: పట్టణంలోని జెండామానువీధిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త జాఫర్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీ జాఫర్ మృతదేహానికి నివాళులర్పించారు.

ఎంపీని కలిసిన ఎమ్మెల్సీ
బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో రామసుబ్బారెడ్డి పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ సభకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఈ కారణంగా బుధవారం సాయంత్రం నుంచి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోవడంతో పలువురు తమ ప్రయాణికులు వాయిదా వేసుకోగా, మరికొందరు ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇలా తరచూ రాజకీయ సమావేశాల సందర్భంగా సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం తగదని పలువురు ప్రయాణికులు మండిపడ్డారు.

ప్రజాస్వామ్యంపై పోలీసు పోటు

- హైదరాబాద్‌లోని సాక్షి కార్యాలయంలో పోలీసుల హల్‌చల్
- ఎడిటర్‌కు నోటీసుల పేరుతో హంగామా
- జిల్లాలోనూ పలు సందర్భాల్లో సాక్షి కరస్పాండెంట్, ఇతర జర్నలిస్టులపై దాడులు



సాక్షి కడప: ప్రజాసామ్యంలో కీలకమైన పత్రికాస్వేచ్ఛపై పోలీసుల జులుం కొనసాగుతోంది. వార్తలు రాస్తే అడుగడుగునా వేధింపులు....మరోవైపు నోటీసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో నకిలీ మద్యం వ్యవహారంపై వార్త రాశారన్న అక్కసుతో పోలీసులు ఏకంగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డికి నోటీసుల నెపంతో హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో పోలీసులు హల్ చల్ చేశారు. అంతేకాకుండా విచారణ పేరుతో సాక్షి ఎడిటర్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చేయడంతోపాటు ఏదో ఒక రకంగా వేధింపులే లక్ష్యంగా అడుగులు ముందుకు వేశారు. మరోవైపు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోనూ సాక్షి జర్నలిస్టులపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా జర్నలిస్టులకు ఇబ్బందులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా సాక్షి ప్రతినిధులపై దాడుల పరంపర కొనసాగుతోంది. ప్రధానంగా ఇటీవల సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నేపథ్యంలో....ఎలాంటి విపత్కరపరిస్థితులు లేకపోయినా వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో వేములలో జిల్లా సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్‌తోపాటు మిగతా సాక్షి జర్నలిస్టులపై కూడా దాడులకు పూనుకున్నారు. ఇవే కాకుండా సాక్షి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి ఎం.బాలకృష్ణారెడ్డిపై కూడాజిల్లాలో పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

వెల్లువెత్తుతున్న నిరసనలు
నకిలీ మద్యం వ్యవహారంపై టీడీపీ నేతలు అడ్డంగా దొరికిపోవడంతో ఏం చేయాలో తెలియక కూటమి సర్కార్ అడ్డదిడ్డంగా ముందుకు పోతోంది. ఈ నేపథ్యంలోనే సాక్షిలో వార్తలు రాస్తున్న పత్రికా ప్రతినిధులు, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి కూడా కేసులు నమోదు చేసి నోటీసుల నెపంతో హంగామా సృష్టిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై అటు అన్నమయ్య, ఇటు వైఎస్సార్ జిల్లాలో సీనియర్ జర్నలిస్టులు, పలు సంఘాల ప్రతినిధులు, సామాజిక వేత్తలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోకడలు మంచివి కాదని, వార్తలు రాస్తే న్యాయపరంగా ముందుకు వెళ్లాలే తప్ప కేసులు పెట్టడం, అరెస్టులు, వేధించడం లాంటివి మంచి పద్ధతి కాదని పలువురు సూచిస్తున్నారు. కూటమి సర్కార్ ఇలాంటి ధోరణి అవలంభిస్తే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు.

ఎడిటర్ పట్ల వేధింపులు తగదు

సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు వేధించడం తగదు. నోటీసులు ఇవ్వాలి తప్ప కార్యాలయాల వద్దకు వెళ్లి హంగామా చేయడం మంచిది పద్ధతి కాదు. ప్రస్తుతం జరుగుతున్న అనేక పరిణామాలు, ఇతర పరిస్థితులను వివరిస్తున్నసాక్షి జర్నలిస్టులపై కేసులు పెట్టి వేధించడం సరికాదు. ఏదైనా ఉంటే న్యాయపరంగా తేల్చుకోవాలి. కేసులు నమోదు చేసి వేధించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. తప్పు చేస్తే లీగల్‌గా నోటీసులు ఇచ్చి న్యాయస్థానంలో పోరాడాలే తప్ప ఇలా చేయడం కరెక్టు కాదు. - సి.వెంకటరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కడప

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టి వేధించడం తగదు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిగానే పరిగణించాల్సి ఉంటుంది. ఇలాంటి ఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిది. జిల్లాలో కూడా సాక్షి జర్నలిస్టులపై పదేపదే పోలీసులు కేసులు పెట్టి ఏదో ఒకరకంగా వేధించాలనుకోవడం మంచి పద్ధతి కాదు. భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం.
- పి.రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకుడు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్న పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరించడం సరికాదు. ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం దారుణం.వెంటనే కేసులుఉపసంహరించుకోవాలి.
-వైవీ శివయ్య, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కదిరి రోడ్డులో వెంకటాపురం కాలనీ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. వెంకటాపురం నుంచి పులివెందులకు వస్తున్న జోగన్న అనే వృద్ధుడు ద్విచక్ర వాహనాన్ని పులివెందుల నుంచి కదిరి రోడ్డు వైపు వెళ్తున్న మరొక ద్విచక్రవాహం ఢీకొంది. ఈ ప్రమాదంలో జోగన్నతోపాటు మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్ఎం



ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిధిలోని ఐసీఎల్ (అల్ట్రాటెక్) సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన రైల్వే లైన్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రైల్వే పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి అందులోని మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. భారతి, జువారి, చిలంకూరు ఐసీఎల్, ఎర్రగుంట్ల ఐసీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీలకు చెందిన ప్రతినిధులు డీఆర్ఎంను కలిశారు. అంతకు ముందు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ మేనేజర్, ఆర్‌పీఎఫ్ సీఐ, గుంతకల్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ, సిబ్బంది స్వాగతం పలికారు.

ప్రమాద బీమా.. తపాలా శాఖ ధీమా!

- రోజుకు రూ.1.50తో రూ. 10 లక్షలు
- రూ. 2 తో రూ. 15 లక్షలు
- సామాన్యులకు అందుబాటులో తపాలా శాఖ బీమా పాలసీలు



పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ లోగో

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఇటీవల ఓ వ్యక్తి పిల్లలను పాఠశాలలో వదిలిపెట్టి ఇంటికి వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది.

ఒక వ్యక్తి గుండె సమస్యతో ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు దానికి ఆపరేషన్ అవసరమని... రూ.లక్ష వరకు ఖర్చవుతుందన్నారు. కొన్నాళ్ల తర్వాత మరో ఆసుపత్రికి వెళితే రూ.2 లక్షలు అవుతుందన్నారు.

ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించి గాయాలైనప్పుడు లేదా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన సందర్భాల్లో ఇలా అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు పాక్షికంగా, లేనిపక్షంలో తాత్కాలిక వైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈ క్రమంలో రక్షణగా ప్రైవేట్ బీమా పాలసీలు ఉన్నప్పటికీ ప్రీమియం అధికంగా ఉండటంతో వాటి పట్ల ప్రజలు ఆసక్తి కనబరచడం లేదు. ఈ తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా తపాలా శాఖ ప్రమాద బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది.

అర్హతలు..

బీమా పాలసీని 18 నుంచి 65 సంవత్సరాల వయసు గలవారు ఎవరైనా తీసుకోవచ్చు. దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది.

ఆధార్ కార్డ్ దానితో లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉండాలి. వైద్య పరీక్షలు చేసిన తర్వాత కొందరికి వర్తిస్తుంది. సాయుధ బలగాలకు ఇది వర్తించదు.

ఎంతో భరోసా...

- రోజుకు రూ.1.50తో రూ.10 లక్షలు, రూ.2తో రూ.15 లక్షలు విలువైన బీమా పాలసీలను తపాలా శాఖ అందుబాటులో తెచ్చింది. ఏడాదికి రూ.549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ. 10 లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల పాలసీలు అందుబాటులో ఉన్నాయి.
- ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. అంగవైకల్యం లేదా పక్షవాతం వచ్చినా పూర్తి బీమా లభిస్తుంది.
- ప్రమాదం జరిగి ఆసుపత్రిలో ఉంటే రూ.60 వేల వరకు చెల్లిస్తారు.
- ఇద్దరు పిల్లలకు విద్యా ప్రయోజనం కింద గరిష్ఠంగా లక్ష రూపాయల వరకు లభిస్తుంది. ఒకవేళ ఫీజులు తక్కువగా ఉంటే వాటిని చెల్లిస్తారు.
- ప్రమాదం జరిగిన వ్యక్తి కోమాలోకి వెళ్తే రూ.లక్ష వరకు కవర్ చేస్తారు.
- ఎముకలు విరిగితే దాని ఖర్చుల నిమిత్తం రూ.లక్ష వరకు చేకూరుతుంది
- తలకు ఏదైనా దెబ్బ తగిలి మానసికంగా ఇబ్బంది పెడితే 4 కన్సల్టెంట్‌లు ఉచితం.
- ఒకరికి ప్రమాదం జరిగి వేరేచోట మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి రావడానికి రూ.25 వేల వరకు చెల్లిస్తారు.
- ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు భరోసాగా రూ.5వేల వరకు లభిస్తుంది.

ఒంటరి జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



ఆ ఆబిదా (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఒంటరి జీవితం గడపలేక షేక్ ఆబిదా (42) అనే మహిళ బుధవారం ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుందరాచార్యుల వీధికి చెందిన ఆబిదాకు రాజుపాళెం మండలం గోపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇమాం ఖాసీం అనే కుమారుడు ఉన్నాడు. తరచు మనస్పర్థలు రావడంతో భార్యా భర్తలు ఏడేళ్ల క్రితం విడిపోయారు. కుమారుడు ఇమాంఖాసీం రెండేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆమె ప్రొద్దుటూరులోని సుందరాచార్యుల వీధిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటోంది. ప్రభుత్వం నుంచి పింఛన్ వస్తుండటంతో ఆ డబ్బుతోనే జీవనం సాగించేది. కుమారుడు మృతి చెందడం, భర్త దూరం కావడం.. ఈ రెండు ఘటనలు ఆమెను మానసికంగా కుంగదీశాయి. దీంతో ఒంటరితనాన్ని భరించలేని ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి ఆమె బంధువులకు సమాచారం అందించారు. తల్లి, బంధువులు వచ్చేలోపే శరీరం పూర్తిగా కాలిపోయి ఆబిదా మృతి చెందింది. ఆబిదా తల్లి మెహరున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

• వామ్మో... ఎంత పెద్ద లారీ!



చెన్నై నుంచి కడప మీదుగా కర్నూలు మార్గంలో నిత్యం భారీ వాహనాలు అధిక లోడుతో ప్రయాణిస్తుంటాయి. ఇందులో వందల టన్నులు బరువు ఉన్న వాహనాలు కొన్నయితే, ఎక్కువ పొడవు కలిగిన వాహనాలు మరికొన్ని ఉన్నాయి. ఈ ఫొటోలో కనిపిస్తున్న భారీ లారీలు రెండో రకానికి చెందినవిగా చెప్పుకోవచ్చు. ఒక్కో వాహనం పొడవు సుమారు 50 మీటర్లు ఉంటుంది. సుమారు ఐదారు వాహనాలు ఒకేచోట నిలబడి భారీ పైపులను మోసుకెళ్తున్నాయి. కడప- కర్నూలు జాతీయ రహదారిలో ఆలంఖాన్‌పల్లె పాత టోల్‌ప్లాజా వద్ద ఈ దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

– కడప కార్పొరేషన్

ఉల్లి రైతులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గిట్టుబాటు ధర లేని కారణంగా ఉల్లి పంట సాగు చేసిన రైతులు ఉరి వేసుకునే పరిస్థితులు దాపురించాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా ఉల్లి రైతులపై కూటమి ప్రభుత్వం వివక్షను ప్రదర్శించిందన్నారు. కనీసం కర్నూలు జిల్లా రైతుల వరకు అయినా న్యాయం చేయలేదన్నారు. ఎకరా ఉల్లి పంటను సాగు చేయాలంటే రూ.లక్ష పెట్టుబడి అవుతుందని, చాలా మంది రైతులు ఐదు ఎకరాల పంటను సాగు చేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు 250 క్వింటాళ్ల పంట పండుతుందని, ధర ఉంటే మూడింతలు లాభాలు వస్తాయన్నారు. ఏ మాత్రం ధర లేని కారణంగా పండించిన పంటను రోడ్లపైనే పారేసే దుస్థితి ఏర్పడిందన్నారు. పంట సాగు చేసిన తర్వాత మూడు నెలల కాలంలో నిత్యం పంటకు కాపలా ఉంటూ సంరక్షించుకున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హెక్టార్‌కు రూ.లక్ష పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలసి కలెక్టరేట్ ఎదుట 48 గంటలు నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వంలో స్పందన రాకపోతే జోలె పట్టి విరాళాలు సేకరించి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ద్వారా ఉల్లి రైతులకు అందజేస్తామన్నారు. ఉల్లి రైతుల సమస్యను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా ఉల్లిని సాగు చేశారని అన్నారు. వ్యవసాయంపై సీఎం చంద్రబాబుకు ఎప్పుడూ చిన్న చూపేనన్నారు. నష్టపోయిన ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అది ఏమాత్రం సరిపోదని, హెక్టారుకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పీఠాధిపతిని నియమించాలి



మాట్లాడుతున్న ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శ్రీనివాసానంద సరస్వతీ స్వామిజీ

కడప రూరల్ : కాలజ్ఞాని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కొలువైన బ్రహ్మంగారిమఠానికి పీఠాధిపతిని నియమించి భక్తుల మనోభావాలను గౌరవించాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ కోరారు. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మంగారిమఠం పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి గతించి నాలుగేళ్లు అయినప్పటికీ నేటికీ పీఠాధిపతి నియామకం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. సాధారణంగా ఏ పీఠంలో అయినా పీఠాధిపతి గతిస్తే సత్వరమే తాత్కాలిక పీఠాధిపతిని నియమించి పీఠం కార్యకలాపాలు కొనసాగిస్తారన్నారు. తాజాగా కోర్టు కూడా సత్వరమే తాత్కాలిక పీఠాధిపతిని నియమించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్రహ్మంగారిమఠం పీఠానికి శాశ్వత పీఠాధిపతిని నియమించాలని, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పలువురు స్వామిజీలు, భక్తులు పాల్గొన్నారు.

పరిశోధనా విశ్వవిద్యాలయంగా నిలవాలి

ఉప కులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ ఉపకులపతి బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్ : నాణ్యమైన పరిశోధనలతో యోగి వేమన విశ్వవిద్యాలయం రానున్న మూడేళ్లలో 'పరిశోధన విశ్వవిద్యాలయం'గా నిలవాలని.. ఆ బాధ్యతను రీసెర్చ్ స్కాలర్లు తీసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలోని స్కాలర్లతో అన్నమాచార్య సెనేట్ హాలులో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనల సంఖ్య పెరగడంతోపాటు నాణ్యమైన పరిశోధనలు రావాలన్నారు. ప్రఖ్యాత పరిశోధన జర్నల్స్‌లో కథనాలు ప్రచురితమైతే తద్వారా మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పక్షం రోజులకు ఒకసారి నిపుణులను మన విశ్వవిద్యాలయానికి ఆహ్వానించి వివిధ అంశాల్లో మెలకువలు నేర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్ర ఓబుళరెడ్డి, స్కాలర్లు పాల్గొన్నారు.

పుష్పగిరి ఆలయాలకు రూ.13,41,000 ఆదాయం

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఒక సంవత్సర కాలానికి తలనీలాల సేకరణకు, టెంకాయల విక్రయ హక్కుకు కొండపైన గల ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు బుధవారం వేలం పాట నిర్వహించారు. మొత్తం రూ. 13, 41, 000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం ఇండియన్ బ్యాంకు కడప బ్రాంచ్‌లో జమ చేసినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప డివిజనల్ అధికారి శివయ్య, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఐజీ గార్ల్‌ను సందర్శించిన జర్మన్ అంబాసిడర్



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న జర్మన్ ఫెడరల్ ప్రభుత్వ అంబాసిడర్

పులివెందుల : పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ – లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐజీ గార్ల్)ను జర్మన్ ఫెడరల్ ప్రభుత్వ అంబాసిడర్ డాక్టర్ ఫిలిప్ అకెర్మాన్ బుధవారం సందర్శించారు. ఆయన వెంట బెంగళూరు కాన్సుల్ జనరల్ అమిత దేశాయ్, కేఎఫ్‌డబ్ల్యూబీ నాచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు అకాడమీలో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఇక్కడ చేపడుతున్న జాతీయ, అంతర్జాతీయస్థాయి అధ్యయనాలు, అకాడమీ ద్వారా సాధిస్తున్న ఫలితాలను పరిశీలించారు. అలాగే ఫార్మర్ సైంటిస్ట్, మెంటార్ కోర్సులను అభ్యసిస్తున్న రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లు, యంగ్ రీసెర్చ్ ఫెలోస్, ఇంటర్న్‌లతో మాట్లాడారు. అనంతరం ఐజీ గార్ల్‌లో ప్రకృతి వ్యవసాయ చక్రం ద్వారా సాగు పద్ధతులు, రైతు సాధికార సంస్థ వారిచే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు, చిరుధాన్యాల వాడకంవల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న లారీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను లారీ ఢీ కొన్న ఘటనలో ఆటోలోని యువకుడి కాళ్లకు తీవ్ర గాయమైంది. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట నుంచి కడపకు వెళుతున్న అరటికాయల ఆటోను కొత్తమాధవరం బస్టాండు సమీపానికి రాగానే కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న మహారాష్ట్రకు చెందిన లారీ ఢీ కొంది. దీంతో ఆటోలోని కడపకు చెందిన శివశంకర్(22) కాళ్లకు తీవ్ర గాయమైంది. గాయపడిన యువకుడిని కడప రిమ్స్‌కు తరలించారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి (50)మృతి చెందాడు. ఆస్పత్రి అధికారి వివరాల మేరకు.. నాలుగు రోజుల క్రితం గాలివీడు ప్రాంతం నుంచి 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అప్పటికే తీవ్ర అస్వస్థతతో ఉన్న అతనికి చికిత్స చేసినప్పటికి పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఆస్పత్రిలో చేరిన రోజు తన పేరు చంద్రయ్య అని, ఊరు తిరుపతి అని చెప్పాడు.

ఇంటి జాగా కోసం అన్నదమ్ముల ఘర్షణ

ములకలచెరువు : ఇంటిజాగా విషయంపై అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లెకు చెందిన అన్నదమ్ములు ఖాదర్‌వలీ, నజీర్‌లు ఇంటిజాగా విష యంపై గొడవపడ్డారు. ఈ గొడవలో ఖాదర్‌వలీ తలపై నజీర్ ఇనుపరాడ్డుతో కొట్టాడు. నజీర్ బంధువులు బీబీ, హుస్సేన్, ఫక్రుద్దీన్ కూడా దాడికి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీటైల్ పోర్టల్ ద్వారా మద్యం విక్రయాలు

రాయచోటి జగదాంబసెంటర్ : లైసెన్సుదారులు తమ మద్యం దుకాణాలలో రీటైల్ పోర్టల్ ద్వారా స్కాన్ అయిన మద్యం సీసాలను మాత్రమే అమ్మాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మధుసూదన్ తెలిపారు. రాయచోటి పట్టణంలో బుధవారం పలు మద్యం షాపుల యజమానులకు, నౌకరనామదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసిన మద్యం బాటిళ్లను అమ్మే ప్రక్రియను ప్రత్యక్షంగా గమనించి సూచనలు

21 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 21 నుంచి 29 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)లో భాగంగా అండర్-14, 17 బాల బాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి పేర్కొన్నారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

తేదీ	క్రీడాంశం	వేదిక
21	వాలీబాల్ బ్యాడ్మింటన్	జగతి మౌంటిస్సోరి స్కూల్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియం
26	ఖోఖో బాస్కెట్‌బాల్ క్రికెట్	మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, కడప డీఎస్ఏ స్టేడియం, కడప డీఎస్ఏ స్టేడియం నెట్స్, కడప
27	కబడ్డీ బేస్‌బాల్ సాఫ్ట్ బాల్ హాకీ	ప్రభుత్వ హైస్కూల్ నేతాజీ సర్కిల్, రాయచోటి జడ్పీ హైస్కూల్ మాసాపేట, రాయచోటి జడ్పీ హైస్కూల్, మాసాపేట, రాయచోటి వైఎస్ఆర్ క్రీడా పాఠశాల, కడప
28	హ్యాండ్ బాల్ చెస్ యోగా	ఏపీఎస్‌డబ్ల్యూ గండి, వేంపల్లె డీఎస్ఏ ఇండోర్ స్టేడియం, కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియం, కడప
29	అథ్లెటిక్స్ కబడ్డీ	వైఎస్ఆర్ క్రీడా పాఠశాల, కడప హెచ్ఎంఎం హై స్కూల్, రైల్వేకోడూరు

బర్రెలు కనిపించలేదని ఫిర్యాదు

మైదుకూరు : బర్రెలు మేపుకొనేందుకు కొండకు వెళ్లగా అందులో మూడు బర్రెలు కనిపించడం లేదని మండలంలోని తువ్వపల్లెకు చెందిన శ్రీనివాసులు, ఎల్లయ్య అనే వ్యక్తులు మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము బర్రెలు పెట్టుకుని పాడితో జీవిస్తున్నామని, వాటిని మేపుకొనేందుకు గ్రామం చుట్టుపక్కల ఉన్న కొండకు వెళ్లే వాళ్లమని ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం యథావిధిగా కొండకు వెళ్లామని ఇంటికి తిరిగి వచ్చే సమయంలో మూడు బర్రెలు కనిపించలేదన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న హిజ్రా స్వాతి

మదనపల్లె : తనకు జరిగిన అన్యాయంపై పోలీసులే న్యాయం చేయాలని లేని పక్షంలో ఆత్మహత్యే శరణ్యమని హిజ్రా స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్థానిక చీకలగుట్టలో ఉంటున్న దంపతులు దమరేశ్వర్, స్వర్ణలత తన దగ్గర నుంచి డబ్బు తీసుకుని ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయింది. తనను నమ్మించి రూ.45 లక్షల నగదు, ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, బిడ్డల కోసం కొన్న బంగారు ఆభరణాలను తీసుకున్నారని, వాటిని తిరిగి చెల్లించాలని కోరుతుంటే బెదిరిస్తున్నారని పేర్కొంది. సీటీఎం రోడ్డులో తనపై దాడికి ప్రయత్నించారని కన్నీటిపర్యంతమైంది. ఒంటరిగా ఉన్న తనను ఏమైనా చేస్తారని భయాందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లానని, పైసాపైసా కూడబెట్టిన డబ్బును, బిడ్డల కోసం కొన్న బంగారు ఆభరణాలను తిరిగి ఇప్పించకుంటే తనకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం

మహిళ, ముగ్గురు పిల్లలను కాపాడిన పోలీసులు



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి

జమ్మలమడుగు రూరల్/మైలవరం : కుటుంబ సమస్యలతో తన ముగ్గురు పిల్లలు, తాను కలసి మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన మహిళను పోలీసులు కాపాడిన సంఘటన మైలవరం మండలంలో జరిగింది. ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహేశ్వరిని తల్లిదండ్రులు నొస్సం గ్రామానికి చెందిన వెంకట శివకు ఇచ్చి 10 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వెంకట శివ పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్‌లో (డబ్బులు వసూలు చేయడం)లో విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి 8, 5, 2 సంవత్సరాల ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు నంద్యాల జిల్లా, సంజామల మండలం నొస్సం గ్రామంలో కాపురం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య సమస్యలు రావడంతో జీవితంపై విరక్తి చెంది మైలవరం జలాశయంలో ముగ్గురు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకోవడానికి ఆమె జలాశయం కట్టమీదకు చేరుకుంది. గమనించిన మైలవరం ఆటో డ్రైవర్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రియాజ్, రమేష్, హృదయ్ అనే సిబ్బంది జలాశయం వద్దకు చేరుకుని మహిళను పోలీస్ స్టేషన్‌కు పిలుచుకొని వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం భార్యాభర్తలకు ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి, సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి పంపించి వేశారు.